ఉచిత గ్యాస్‌పై ఫిర్యాదులు వస్తే చర్యలు

శ్రీకాకుళం అర్బన్ : ఉచిత గ్యాస్ పంపిణీలో అదనపు ఛార్జీల వసూళ్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. సిలిండర్‌కు అదనంగా రూ.80 నుంచి 150 వరకు డెలివరీ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు అందుతున్న ఫిర్యాదులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా పథకం అమల్లో లబ్ధిదారులకు ఇబ్బందులు ఉంటే నేరుగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో గానీ 9491222122 ఫోన్ నంబరుకు గానీ ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. గ్యాస్ ఏజెన్సీలు, సేల్స్ అధికారులు, డెలివరీ బాయ్స్ ఎవరైనా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత ఏజెన్సీని బ్లాక్ లిస్టులో చేర్చి లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఓన్లీ విజన్... నో యాక్షన్

- టిడిపి అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ కొత్త విజన్లు
- 2024-29 కాలానికి మరోసారి కార్యాచరణ ప్రణాళిక
- అటకెక్కిన 2014-19 యాక్షన్ ప్లాన్
- జిల్లా అభివృద్ధిపై అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న బాబు

సంక్రాంతి పండగ రావడంతో పల్లెలు కళకళలాడుతున్నాయి. పనుల్లేక జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారంతా తమ సొంత గూటికి చేరుకుని కుటుంబసభ్యులతో ఆనందం పంచుకున్నారు. పండగ ముగిసిన తర్వాతే షరా మామూలే. మూటాముల్లె సర్దుకుని తిరుగుముఖం పట్టడం ఏటా మనం చూస్తున్నవే. వలసలను నివారిస్తాం, పరిశ్రమలను తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామంటూ ఏళ్ల తరబడి పాలకులు మభ్యపెడుతూనే ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా పగ్గాలు చేపట్టిన ప్రతిసారీ విజన్, యాక్షన్ ప్లాన్ అంటూ హడావుడే కనిపిస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో తాజాగా జిల్లా అధికారులు 2024-29 ఐదేళ్ల కాలానికి స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. పాత సీసాలో కొత్త సారా అన్న చందంగా అందులోని అంశాలన్నీ గతంలో 2019-24 కాలానికి రూపొందించిన విజన్ యాక్షన్ ప్లాన్‌లో విషయాలే ఉన్నాయి. వాటిని ఒకసారి పరిశీలిద్దాం.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా అభివృద్ధిని జిల్లా స్థూల ఉత్పత్తి (జిడిడిపి), తలసరి ఆదాయం వంటి అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటారు. విభజనకు ముందు, తర్వాత కూడా ఆ రెండు అంశాల్లోనూ జిల్లా అట్టడుగున ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు నాయుడు 2014-2024 కాలానికి రాష్ట్రంతో పాటు జిల్లాకూ విజన్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు. చంద్రబాబు సిఎం అయ్యే నాటికి 2014-15లో జిల్లా జిడిడిపి రూ.20,597 కోట్లుగా ఉంది. 2017-18 నాటికి దాన్ని రూ.30,575 కోట్లకు తీసుకువెళ్తామని విజన్ ప్లాన్‌లో పేర్కొన్నారు. 2022-23 నాటికి ప్రభుత్వ లెక్కల ప్రకారం 37,282 కోట్లుగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత విజన్ ప్లాన్‌లో 2028-29 నాటికి దాన్ని ఏకంగా రూ.81,846 కోట్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఎనిమిదేళ్లకు కనీసం రెట్టింపు కాని జిడిడిపిని నాలుగేళ్లలో రెట్టింపు చేస్తామని ప్రభుత్వం చెప్తోంది.



వ్యవసాయంలో అవే పరిస్థితులు

వ్యవసాయం, అనుబంధ రంగాల ద్వారా ప్రస్తుతం రూ.12,376 కోట్ల జిడిడిపి వస్తుండగా 2028-29 నాటికి రూ.25,416 కోట్ల లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత జిల్లాలో ఎటువంటి వ్యవసాయం, సాగు పరిస్థితులు ఉన్నాయో... ఈ పదేళ్లలోనూ అవే పరిస్థితులు ఉన్నట్లు అందులో పొందుపరిచింది. తక్కువ ఉత్పాదకత, ఒకే ఒక్క పంట కారణంగా చిన్న, సన్నకారు రైతులు చాలా పేదరికంలో ఉన్నారని పేర్కొంది. నీటి నిర్వహణలో అధ్వాన పరిస్థితి, పంటలు పండిన తర్వాత నష్టాలు, మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం తదితర అంశాలు వ్యవసాయంలో వెనుకబడడానికి కారణాలుగా తెలిపింది.

పదేళ్లయినా పారిశ్రామిక రంగం నిరాశాజనకమే

జిల్లాలో పారిశ్రామిక రంగం ద్వారా 2014-15లో రూ.5,464 కోట్ల ఆదాయం సమకూరింది. పదేళ్ల తర్వాత కూడా పెద్దగా పురోగతి కనిపించడం లేదు. ప్రస్తుతం రూ.6,879 కోట్లు మాత్రమే ఆదాయం వస్తున్నట్లుగా అధికారిక లెక్కలు చెప్తున్నాయి. 2019-24 విజన్ ప్లాన్‌లో దాన్ని రూ.6,953 కోట్లకు చేరుస్తామని అంచనా వేశారు. ఇప్పటికీ దాన్ని అందుకోలేక పోయారు. 2028-29 నాటికి రూ.15,389 కోట్లకు చేరుకుంటామని చెప్తున్నారు. నైపుణ్యం గల కార్మికుల వలస, పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా కార్మికులను అందించలేకపోవడం అడ్డంకులుగా ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

2019-24లో రూపొందించిన విజన్ యాక్షన్ ప్లాన్



2024-29కి తయారు చేసిన స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్

సాగునీటి ప్రాజెక్టులకు పాత విజనే

జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన వంశధార, ఆఫ్‌షోర్, వంశధార-నాగావళి నదుల అనుసంధానం, తోటపల్లి పాత రెగ్యులేటరీ ఆధునీకరణ తదితర సాగునీటి ప్రాజెక్టులపై పాత విషయాలనే కొత్త విజన్‌గా పేర్కొన్నారు. ఏ ప్రాజెక్టు పూర్తికి ఎంతమేర నిధులు అవసరమో పొందుపరచలేదు. వంశధార స్టేజ్-2 ఫేజ్-2లో హిరమండలం రిజర్వాయరు 95 శాతం, 87 ప్యాకేజీ పనులు 80 శాతం, 88 ప్యాకేజీ పనులు 95 శాతం పూర్తయ్యాయి. వీటిని 2025-26 నాటికి పూర్తి చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. 2014-19 కాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత జిల్లాకు వచ్చిన ప్రతిసారీ వంశధారను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. ఆఫ్‌షోర్ టిడిపి హయాంలోనే పున:ప్రారంభించారు. ఇప్పటికి 45 శాతం పనులే పూర్తయ్యాయి. వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనులూ టిడిపి హయాంలోనే ప్రారంభం కాగా, ప్రస్తుతం 73 శాతం పూర్తయ్యాయి. కుడి కాలువ ఆధునీకరణ పనులు చేయాల్సి ఉందని విజన్‌లో పొందుపరిచారు. 2014 నుంచి ఇప్పటివరకు ఆధునీకరణ పనుల ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు.

ప్రయివేటుకు పర్యాటకం

2019-24లో రూపొందించిన విజన్ ప్లాన్‌కు, ప్రస్తుతం రూపొందించిన యాక్షన్ ప్రణాళికు చాలా తేడా కనిపిస్తోంది. గతంలో ప్రభుత్వ రంగంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించగా ప్రస్తుతం ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యం (పిపిపి)తో పలు ప్రాజెక్టులకు ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించాలని చూస్తోంది. శ్రీకాకుళం వండ్రంగం పెద్దగనగళ్లవానిపేటలో బీచ్ కుటీరాల పేరుతో ఏడాదికి రూ.2.25 లక్షలను చెల్లించేలా కెప్టెన్ టూల్ అండ్ రైడ్స్ అనే సంస్థకు ఐదేళ్లకు లీజ్‌కు ఇచ్చారు. హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద వాటర్ స్పోర్ట్స్, సందర్శకుల సాహసకృత్యాల కోసం టూరిజం పార్కునూ కెప్టెన్ టూల్ రైడ్ సంస్థకు అప్పగించారు. గార మండలం శాలిహుండం కొండ దిగువన రిసార్టును విశాఖకు చెందిన వ్యక్తికి కేటాయించారు. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లిలో శివసాగర్ బీచ్ వద్ద బీచ్ కుటీరాల నిర్మాణం కోసం టూరిజం పార్కును రెవా బీచ్ రిసార్ట్స్ ప్రైవేట్‌కు అప్పగించారు. జిల్లాలో ప్రసిద్ధ ఆలయాలైన అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం తదితర ప్రాంతాలను కలిపేలా టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలని టిడిపి ప్రభుత్వ హయంలో 2016లో నిర్ణయించగా, ప్రస్తుత విజన్ ప్లాన్‌లోనూ దాన్ని పొందుపరిచారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- వామపక్షాలు, ప్రజాసంఘాల డిమాండ్
- అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, తాండ్ర ప్రకాష్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా వామపక్షాలు, పలు ప్రజాసంఘాల నాయకులు నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ వేదికగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసును నమోదు చేయాలన్నారు. జాతీయ ఎస్‌సి కమిషన్ జోక్యం చేసుకోవాలని, ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి పెట్టాలనే ఉద్దేశంలో భాగంగానే పార్లమెంట్ వేదికగా అమిత్ షా వ్యాఖ్యలు బయటపడ్డాయని విమర్శించారు. అంబేద్కర్‌ను అనడం ఫ్యాషన్‌గా మారిందని, వాళ్లు అన్నిసార్లు అనడం కంటే దేవుడు పేరు స్మరిస్తే స్వర్గంలో స్థానం దక్కుతుందని అమిత్ షా వ్యాఖ్యానించడం బిజెపి అసలు రంగు బయటపడిందన్నారు. బిజెపి ఫాసిస్టు, నియంతృత్వ విధానానికి నిదర్శనమన్నారు. ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుతున్నది అంబేద్కర్ వల్లే అనే వాస్తవాన్ని మర్చిపోకూడదన్నారు. అమిత్ షా వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయన్నారు. అయినా బిజెపి వైఖరిలో మార్పు లేదని విమర్శించారు. అన్ని తరగతుల, వర్గాల ప్రజానీకం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు చిక్కాల గోవిందరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, కె.మోహనరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.కృష్ణవేణి, జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు కొత్తకోట అప్పారావు, పలు ప్రజాసంఘాల నాయకులు గోవర్ధనరావు, ఎల్.మహేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో విశాఖ నాన్‌స్టాప్ టిక్కెట్ కౌంటర్ వద్ద ప్రయాణికుల రద్దీ

తిరుగు ప్రయాణం

- ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బారులు తీరిన ప్రయాణికులు
- టిక్కెట్ ధరలు పెంచిన ప్రైవేట్ ట్రావెల్స్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వచ్చిన వారు తిరుగు పయనమవుతున్నారు. దీంతో శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ కిక్కిరిసిపోయింది. విజయవాడ, హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి జిల్లాలోని స్వగ్రామాలకు వచ్చిన జనమంతా పిల్లాపాపలతో పెద్దసంఖ్యలో తిరుగు ప్రయాణమవుతున్నారు. కొందరు రైళ్లు, బస్సులను ఆశ్రయిస్తుంటే మరికొందరు సొంత కార్లు, ప్రైవేటు వాహనాల్లో తిరిగి బయలుదేరారు. పలు ప్రాంతాలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఎక్స్‌ప్రెస్, సూపర్ డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసులతో పాటు సాధారణ బస్సులను ప్రత్యేక బస్సులుగా నడుపుతోంది.

పండగకు వచ్చిన వారిలో అత్యధికం ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి తిరుగు పయనమవుతారు. రైల్వే రిజర్వేషన్లు ముందుగానే అయిపోవడంతో రైళ్లు కిటకిటలాడుతున్నాయి. దీంతో బస్సులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చిన వారితో శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ నిండిపోయింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్‌టిసి జిల్లా నుంచి పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అవసరమున్న అన్ని రూట్లలో బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు.

ప్రైవేటు ట్రావెల్స్ దందా

పండగ రద్దీని ప్రైవేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. గతంలో విజయవాడకు రూ.600 నుంచి రూ.700 మధ్య టిక్కెట్టు వసూలు చేస్తే, ఇప్పుడు డిమాండ్‌ను బట్టి రూ.1500 నుంచి రూ.రెండు వేల వరకు ఉంది. హైదరాబాద్ వంటి ప్రాంతాలకు మామూలు రోజుల్లో రూ.2,400 ఉన్న టిక్కెట్‌ను బుధవారం రూ.3,500కు పెంచారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్ తీసుకున్నా అదే ధర వసూలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులపై అదనపు భారం పడుతోంది.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

పకడ్బందీగా భూ రీ సర్వే

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రెండో దశ సమగ్ర భూ రీ సర్వేను అధికారులు బాధ్యతతో నిర్వహించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని యరగాంలో ఆదివారం నిర్వహించిన రీ సర్వే ర్యాలీలో పాల్గొన్న అనంతరం నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన భూ సర్వే లోపభూయిష్టంగా మారిందని విమర్శించారు. ఎనిమిది లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను వైసిపి నాయకుల పేర్లు నమోదు చేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ భూములను కాపాడడానికి రెండో దశ రీ సర్వే చేపడుతోందని చెప్పారు. రెవెన్యూ, గ్రామ సచివాలయ ఉద్యోగులు రీ సర్వే ద్వారా ప్రభుత్వ భూములు కాపాడడానికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా గ్రామ కంఠాలు, ప్రభుత్వ, దేవాదాయ భూముల విషయంలో అధికారులు సమగ్ర సర్వే చేసి నివేదికలను రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్.మధుసూదన్, డిటి జగదీష్, సర్వేయర్ సూర్యనారాయణ, టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ, ఎన్.గోవిందరావు, టి.సురేంద్ర, జి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కానిస్టేబుల్ విధులు కీలకం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోలీస్‌స్టేషన్‌లో నిర్వర్తిస్తున్న విధుల్లో కోర్టు కానిస్టేబుల్ విధులు కీలకమని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. పోలీస్‌స్టేషన్లు, న్యాయస్థానాల మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తూ అంకితభావంతో పనిచేస్తూ శిక్షల శాతం పెంచే విధంగా శ్రమించాలని కోర్టు కానిస్టేబుల్, కోర్టు లైజన్ పోలీసు సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్‌స్టేషన్ల కోర్టు సిబ్బంది, కోర్టు లైజన్ సిబ్బందితో కోర్టు కేసుల విచారణ విధానం, పలు దశల్లో ఎదురవుతున్న సమస్యలు, సమన్లు, వారెంట్ల అమలు, సాక్ష్యాలను కోర్టులో హాజరుపరచడం, కేసు అభియోగ పత్రాలు దాఖలు, ఇతరత్రా విధి విధానాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కేసు నమోదు నుంచి తుది తీర్పు వరకు ఈమధ్య కాలంలో జరిగిన కేసులకు సంబంధించిన ప్రతి అంశాన్నీ పూర్తి వివరాలతో సిసిటిఎన్ఎస్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కేసుల విచారణ సమయంలో ప్రతి విషయాన్ని సంబంధిత స్టేషన్ హౌస్ అధికారికి తెలియజేస్తూ నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. కోర్టులో కేసుకు సంబంధించి ప్రాసెస్‌ని ప్రతిరోజూ కేసు డైరీ రూపంలో జత చేయాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సలహాలు, సూచనలు పాటిస్తూ శిక్షల శాతం పెరిగేందుకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ శ్రీనివాస, ఎస్ఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

సామాజిక సంఘ సంస్కర్త వేమన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సామాజిక సంఘ సంస్కర్త, తెలుగు సమాజానికి తన పద్యాల ద్వారా వెలుగులు నింపింది వేమన అని ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. వేమన జయంతిని పురస్కరించుకుని బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసుకున్న ప్రజా కవి యోగి వేమన అని అన్నారు. సరళమైన వాడక భాషలో అర్థవంతమైన పద్య రచనలు చేశారన్నారు. పిల్లలు మొదలు పెద్దల వరకు వేమన పద్యాలను తెలియని వారు ఉండరన్నారు. ఆయన రాసిన పద్య కావ్యాలకు అత్యంత ప్రజాదరణ ఉందని, నేటికీ ఈ ఆదరణ చెక్కు చెదరడం లేదన్నారు. ఆయన రాసిన పద్య రచనల్లో విశ్వదాభిరామ వినురవేమ నిర్వచనంతో కూడిన పదాలు ఎప్పటికీ మరిచిపోలేనివన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, బిసి సంక్షేమశాఖ అధికారి అనురాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

యోగి వేమన జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.వి రమణ వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని సమస్యలను భిన్న కోణాల్లో దర్శించి వాటిని తన పద్యాల్లో ప్రదర్శించారని కొనియాడారు. ఎంతో లోతైన భావాన్ని కూడా సరళమైన భాష, చక్కటి పదజాలం, ఉదాహరణలతో హృదయాన్ని హత్తుకునేలా పద్యాల రూపంలో సమాజానికి అర్థమయ్యే రీతిలో చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వు డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, పోలీసు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేమన చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే, జెసి

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

- రోజుకు 60 గ్రామాల్లో పరీక్షలు
- ఉపాధి హామీ నిధులతో గోశాలల నిర్మాణం
- పశుసంవర్ధక శాఖ జెడి కె.రాజగోపాల్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పాడి రైతులకు మేలు చేకూర్చే విధంగా ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు కంచరాన రాజగోపాల్ తెలిపారు. ప్రతిరోజూ 60 గ్రామాలను ఎంపిక చేసుకుని మండలానికి రెండు గ్రామాలు చొప్పున వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గోశాలల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు కేటాయించిందని తెలిపారు. ఇప్పటికే కొన్ని గోశాలలను పూర్తి చేసి ప్రారంభించినట్లు చెప్పారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు వీలుగా చర్యలు చేపడుతున్నామన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రయోజనం చేకూరుస్తున్నట్లు తెలిపారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

? పాడి రైతులకు పశుసంవర్ధక శాఖ ద్వారా ఎలాంటి ప్రయోజనాలను అందిస్తోంది?

జిల్లాలో పశుసంపద ఆరోగ్యంగా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వాతావరణంలో వస్తున్న మార్పులు, దోమల బెడద, అపారిశుధ్యం వల్ల పశువుల్లో వ్యాధులు సంక్రమిస్తుంటాయి. అందువల్ల గ్రామాల్లో క్షేత్రస్థాయిలో రైతుల్లో అవగహన కల్పించడంతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా ఈనెల 20 నుంచి జిల్లావ్యాప్తంగా పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నాం. ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించే శిబిరాల్లో ప్రతిరోజూ మండలానికి రెండు గ్రామాలు చొప్పున రోజుకు 60 గ్రామాలను ఎంపిక చేయడైంది. ఈ శిబిరాల్లో పెద్దఎత్తున రైతులు పాల్గొనేందుకు వీలుగా విస్తృత ప్రచారం చేస్తున్నాం.

? జిల్లాలో పశువుల గణాంకాలు ఎలా ఉన్నాయి?

జిల్లాలో చేపట్టిన పశుగణన ఆధారంగా ఆవులు 4.56 లక్షలు, గేదెలు 0.40 లక్షలు, అందులో పాడి పశువులు 3,75,345, లేగ దూడలు 45,914, గొర్రెలు 6.23 లక్షలు, మేకలు 2.77 లక్షలు, కోళ్లు 13.19 లక్షలు, పందులు 3092 రైతుల పెంపకంలో ఉన్నాయి. వాటి పెంపకానికి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు వివరిస్తున్నాం. జిల్లాలో 154 పశువైద్యశాలల ద్వారా వాటికి పశువైద్య సేవలు అందిస్తున్నాం. దీనికితోడు 12 రోజుల పాటు నిర్వహించే పశువైద్య శిబిరాల్లో వాటన్నింటికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ శిబిరాల్లో పశువైద్యాధికారి, పారా వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్ర, పశుసంవర్ధక శాఖ ఎడి, సహాయకులు బృందంగా ఏర్పడి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత వైద్యాన్ని అందించడంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తాం. క్రమం తప్పకుండా రైతులు వాటిని వాడే విధంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉంటుంది.

? గోశాలల నిర్మాణం ఎలా సాగుతోంది?

జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ నిధులతో పెద్దఎత్తున గోశాలల నిర్మాణం జరుగుతోంది. జిల్లాలో ఇప్పటికే సుమారు 900 గోశాలల నిర్మాణం పూర్తి చేయడమైంది. ప్రభుత్వ నిబంధనల మేరకు నేరుగా రైతులకే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నాం. డ్వామా పర్యవేక్షణలో నిధులు మంజూరు చేయడం జరుగుతోంది. రైతులకు ఈ పథకం ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తోంది. నిర్మాణం పూర్తయిన గోశాలలను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తూ రైతులకు అందజేస్తున్నారు.

? పశు బీమా అమలు ఎలా ఉంది?

జిల్లాలో పశువుల పెంపకందారులు బీమా ప్రీమియం చెల్లించడం ద్వారా అనుకోని సంఘటన ఎదురైనప్పుడు పరిహారం పొందడానికి వీలుంటుంది. బీమాపై అవగాహన లేక కొందరు, నిర్లక్ష్యంగా ఉంటూ అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు నష్టపోతున్నారు. అందువల్ల ప్రతి రైతు పంటల బీమా మాదిరిగా పశువులకు బీమా చేయించుకోవాలి. దీనిపై అవగాహన కల్పిస్తున్నాం.

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి- కవిటి
జగతి పంచాయతీ పరిధిలోని వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సౌకర్యం కల్పించి సహకరించాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ విప్ అశోక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలోని వ్యవసాయ కనెక్షన్లకు బొరివంక సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుందని, అయితే గత కొంతకాలంగా వాలా లైన్ల వద్ద విద్యుత్ పరికరాలు పాడవడం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. వీటి పునరుద్ధరణ కోసం గత ఆగస్టులోనే సామగ్రి అందుబాటులోకి వచ్చినా ఖరీఫ్ సీజన్ ప్రారంభమవడంతో పనులు జరగలేదని తెలిపారు. అప్పటినుంచి ఇప్పటివరకు విద్యుత్ సరఫరా లేదని, ప్రస్తుత రబీ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని జగతి పంచాయతీ పరిధిలో వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా అందించాలని కోరారు. కార్యక్రమంలో భావన నారాయణమూర్తి, భావన సీతారామమూర్తి, తమరాల హరినాథ్, పిరియా వెంకటరమణ, శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన జీడి రైతు సంఘం నాయకులు

జీడి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
ఎన్నికల్లో టిడిపి నాయకులు జీడి రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని జీడి రైతుల సంఘం నాయకులు కోరారు. ఆదివారం బైపల్లిలో కోనేరు కామేశ్వరరావు అధ్యక్షతన జీడి రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీడి మద్దతు ధర అంశంపై స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష అసెంబ్లీలో ప్రస్తావించినప్పటికీ ప్రభుత్వం నుంచి జీఓ విడుదల కాలేదన్నారు. ప్రస్తుతం జీడి సీజన్ ప్రారంభం కానున్న తరుణంలో ఎన్నికల్లో జీడి రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసే దిశగా శాశ్వతమైన చర్యలను ప్రారంభించాలని కోరారు. ఇదే అంశంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడును కలిసి జీడి రైతు ప్రతినిధులు చర్చలు జరుపుతున్న ఎమ్మెల్యే గతంలో ఇచ్చిన మాట ప్రకారం చొరవ చూపాలని కోరారు. సమావేశంలో జీడిరైతు సంఘం సభ్యులు కోనేరు తెప్పల అజయ్ కుమార్, కోనేరు రమేష్, బత్తిని లక్ష్మీనారాయణ, వాసుపల్లి సాంబమూర్తి, అంబటి రామకృష్ణ, కొర్ల హేమారావు చౌదరి, తెప్పల చాణక్య, బొంపల్లి శివకుమార్, గుల్ల ఈశ్వరరావు, సానా కృష్ణారావు, తామాడ పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్గా సందర్శన

ఆమదాలవలస: కలింగపట్నంలోని మదీనా బాబా దర్గాను దర్శించుకొని ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం దర్గాకు వెళ్లిన ఆయనకు దర్గా నిర్వాహకులు ముస్లిం సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ తమ్మినేని గీతా సాగర్ ముస్లిం సోదరులతో కలిసి దర్గాలో పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లిం సోదరుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షులు నాగళ్ల మురళీధర్, న్యాయవాది తమ్మినేని అన్నం నాయుడు, జిలాని, అబ్బు, బొకారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రసాద్ రెడ్డి తదితరులు

పారిశ్రామిక నైపుణ్యాలు పెంచుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట
విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని విశాఖపట్నం ఎంఎస్ఎంఇ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ శాఖ) టెక్నాలజీ సెంటర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రసాద్ రెడ్డి అన్నారు. విశాఖపట్నం టెక్నాలజీ సెంటర్‌లో స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేకంగా నిర్వహించిన పారిశ్రామిక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పారిశ్రామిక నైపుణ్యాలు ఉండాలని అప్పుడే వారికి వాస్తవ ప్రపంచ అనుభవం లభిస్తుందన్నారు. టెక్నాలజీ సెంటర్ ద్వారా చిన్న పరిశ్రమలు మరింత ఊతమివ్వడం ఎంఎస్ఎంఇల ప్రధాన లక్ష్యమన్నారు. టెక్నాలజీ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శాలిబ్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను తయారు చేయడమే ధ్యేయంగా ఈ స్కిల్ సెంటర్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపల్ డా కె.మురళీ కృష్ణ, పద్మావతి కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డా మాకేనా సతీష్ పాల్గొన్నారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి పద్మ

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి
మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ఎంపిపి కడియాల పద్మ తెలిపారు. మండలం సహలాలపుట్టుగ పంచాయతీలోని పరిగి వీధిలో రూ.1.5 లక్షల 15వ ఆర్థిక సంఘ నిధులతో మోటార్ బోరు పనులకు ఆదివారం ఎంపిపి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, మాజీ సర్పంచ్ భగవాన్ ప్రధాన్, గొర్లపాడు సర్పంచ్ ప్రతినిధి వల్లయ్య, దట్టి అజయ్, చంద్రమణి తులసయ్య, గ్రామపెద్దలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊరంతా కంపే...

●రోడ్లపైనే మురుగునీరు ●ప్రబలుతున్న వ్యాధులు
●పట్టించుకోని పాలకవర్గం

రోడ్డు మధ్యలో ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి- బూర్జ
ఆ గ్రామంలో అడుగు పెడితే చాలు దుర్గంధం వెదజల్లుతుంది. ముక్కుపుటాలు అదురుతుంటాయి. మండలంలోని మామిడి వలసలో గ్రామస్తులు నిరంతరం దుర్గంధం తోనే సావాసం చేస్తుంటారు. 1200 పైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మురుగునీరు అంతా వీధి మధ్యగుండా పారుతూనే ఉంటుంది. మండు వేసవిలో సైతం రహదారులపైన మురుగునీరు చెరువులను తలపించే విధంగా పారుతూ ఉంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కాలువలు లేకపోవడంతో వాడుకనీరు తప్పనిసరి పరిస్థితుల్లో రహదిరిపై విడిచి పెట్టేస్తున్నామని, రహదారికి ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేయాలని గత దశాబ్దాల కాలంగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించు కున్నప్పటికీ పట్టించుకున్న పాపానపోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి వీధుల్లో కాలువలు ఏర్పాటు చేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న పాలకవర్గం ఆ తరువాత ఆ ఊసే ఎత్తడంలేదని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఏ వీధిలోనూ రహదారులు లేకపోవడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. రహదారులు లేక మురుగునీరు చెరువును తలపిస్తుందని, రాత్రుల సమయంలో పిల్లలు, వద్దులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రబలుతున్న వ్యాధులు

ఇళ్ల చుట్టూ మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

పట్టించుకోని పాలకవర్గం..

గ్రామంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ పాలకవర్గం పట్టించు కోకపోవడం విడ్డూరంగా ఉందని, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పంచాయతీ పాలకవర్గం స్పందించి గ్రామంలో కాలువలతో పాటు రహదారుల నిర్మాణానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుర్గంధం భరించలేకపోతున్నాం

మురుగునీరు వీధిమధ్యలో పారుతుండడంతో దుర్గంధం భరించలేకపోతున్నాం. దోమలు, ఈగలు ముసురుకుంటున్నాయి. పాలకవర్గం పట్టించుకోవడం లేదు. సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.
- మామిడి లక్ష్మి, గృహిణి

కాలువలు ఏర్పాటు చేయాలి

గ్రామంలో వీధి కాలువలు లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నాం. పాలకవర్గం, అధికారులు స్పందించి గ్రామంలో ములుగు కాలువలు, రహదారులు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.
- మంతిని చిలకమ్మ, గృహిణి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఒడిశా వాసులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి సంతపేట జంక్షన్ భువనేశ్వరి అమ్మవారి ఆలయం సమీపంలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టిన సంఘటనలో ఒడిశాకు చెందిన ఇద్దరు యువకులు మృతిచెందగా సోంపేట మండలానికి చెందిన ముగ్గురు తీవ్రగాయాల పాలయ్యారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు ఆదివారం ఉదయం పనులు నిమిత్తం ఒడిశా బొనసల గ్రామానికి చెందిన ఇసురు వినోద్ రెడ్డి (24), ఒడిశా పాత్రపూర్ బురద గ్రామానికి చెందిన బమ్మిడి కార్తీక్ (24) వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై ఇచ్ఛాపురం వచ్చారు. పనులు ముగించుకొని తిరిగి జొనసల గ్రామానికి వెళుండగా సోంపేట మండలం మాకన్నపురానికి చెందిన చిత్రాడ రమేష్, తాళభద్రకు చెందిన హనుమంతపల్లి కార్తీక్, చిత్రాడ సిద్దార్ధ తులసమ్మగుడి వద్ద పూజలు చేసుకొని ఒకే బైక్‌పై మండపల్లిలో బంధువుల ఇంటికి వస్తుండగా ఇచ్ఛాపురం నుంచి అతివేగంగా వెళ్తున్న జొనసల గ్రామానికి చెందిన వీరిద్దరూ భువనేశ్వరి అమ్మవారి ఆలయం మలుపు వద్ద బైకును అదుపు చేయలేక రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి అవతల రోడ్డు లొద్దపుట్టి నుంచి ఇచ్ఛాపురం వైపు వస్తున్న సోంపేట మండలానికి చెందిన వారి బైక్‌ను అతివేగంగా ఢీకొట్టారు. దీంతో ఒడిశాకు చెందిన ఇద్దరూ సంఘటనా స్థలంలో మృతి చెందగా, నినున గ్రామానికి చెందిన చిత్రాడ రమేష్ కాళ్లు, చేతులు విరిగిపోగా, తాళభద్ర గ్రామానికి చెందిన హనుమంతపల్లి కార్తీకకు కాలు విరిగిపోయింది. చిత్రాడ సిద్దార్ధ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వీరు ముగ్గురు ఇచ్ఛాపురం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి బడులు

టెక్కలి: విద్యాశాఖ ఆదీనంలో ఉన్న అన్నిరకాల యాజమాన్య పాఠశాలలు సంక్రాంతి సెలవుల అనంతరం సోమవారం నుంచి తెరుచుకోనున్నాయి. ఈ నెల 10 నుంచి ప్రకటించిన సంక్రాంతి సెలవులతో పదిరోజుల పాటు పాఠశాలలు మూతబడ్డాయి. సోమవారం నుంచి తెరుచుకోనున్నాయి.

వారిపై చర్యలు తీసుకుంటాం

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న పలువార్డుల్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులపై చర్యలకు వెనుకాడబోమని పంచాయతీ కార్యనిర్వహణాధికారి కె.వి.వి.జగన్నాథం తెలిపారు. పండుగ దినాలు ప్రారంభం నుంచి విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన కారణంగా వీరిపై చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. పారిశుధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం చూపడంతో వీధుల్లో, ప్రధాన కూడళ్లలో చెత్త తొలగించడం జరగలేదన్నారు. పండుగ పూర్తయినప్పటికీ ఇంకా కార్మికులు విధులకు కాలేదన్నారు. పంచాయతీలో వివిధ రకాల క్యాడర్లలో సుమారు 60 మంది కార్మికులున్నప్పటికీ వీరిలో పది శాతం మంది కార్మికులు మాత్రమే విధులకు హాజరవుతున్నారని, వారిపై పనిఒత్తిడి పెరుగుతుందన్నారు. సోమవారం నుంచి విధులకు గైర్హాజరైన కార్మికులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆయన తెలిపారు.

ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణం పొందరవీధిలో నివాసముంటున్న రాము బదిత్య మెదడు సంబంధిత సమస్యలతో శ్రీకాకుళంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాము తండ్రి కూడా సంవత్సర కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ ఆయన వైద్యఖర్చుల నిమిత్తం రూ.7,500 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ సభ్యులు ధనుష్ రంగ, గుడియా రాజు, బచ్చు గుణశ్రీ, దామోదర్ బాదిత్యా, సురేష్ పండిత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెదడుకు సంబంధించిన సమస్యలతో చికిత్స పొందుతున్న రాము బదిత్యకు సహాయం చేసేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సభ్యులు కోరారు..

బోసిపోయిన రోడ్లు

టెక్కలి: సంక్రాంతి పండుగ సెలవులు పూర్తయిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల నుంచి జనాలు తిరిగి పట్టణాలకు వెళ్లిపోవడంతో ఆదివారం టెక్కలి పట్టణంలోని ప్రధానమైన రోడ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. పండుగ ప్రారంభం నుంచి శనివారం వరకు కిటకిటలాడిన రోడ్లు ఆదివారం నాటికి బోసిపోయాయి. గ్రామాలకు వచ్చిన వారు తిరిగి వెళ్లిపోవడంతో పాటు ఆదివారం కావడంతో కొంతమంది ఇళ్లకే పరిమితం కావడంతో రోడ్లన్ని ఖాళీగానే కనిపించాయి.

రద్దీ లేని ఇందిరాగాంధీ కూడలి మార్గం

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వ్యాపారులు

ఎమ్మెల్యేకు అభినందనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
నగరంలో పాలకొండ రోడ్డును అభివృద్ధి చేసేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యే గొండు శంకర్‌ను పట్టణ వర్తకులు అభినందించారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని వారి సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. ప్రస్తుతం రోడ్డు మధ్యస్థంగా ఉన్న చెట్లను తొలగించడంతో పాటు సెంటర్ పార్కింగ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవడం వల్ల వ్యాపారులకు సౌకర్యవంతంగా ఉందని వారు ప్రస్తావించారు. ఈ రోడ్డులో సెంటర్ పార్కింగ్ వల్ల వచ్చే ఇబ్బందులను పరిశీలించిన తర్వాతే పూర్తి నిర్ణయం తీసుకుంటానని హామీఇచ్చారు. కళింగపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం సిఎస్‌పి రోడ్డు ఎస్‌హెచ్ వన్‌గా అభివృద్ధి చేయడం అవసరమన్నారు. దీనికి తోడు సెంటర్‌లైటింగ్‌ను అమర్చాల్సి ఉందన్నారు. పర్యావరణానికి ముప్పు రాకుండా అవసరమైన పచ్చదనాన్ని నగరంలో పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధికి వ్యాపారులు భాగస్వాములు కావాలన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి- పలాస
కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛ ఆంధ్రాలో భాగంగా స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. సిఐ స్థాయి నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు సిబ్బందంతా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులై పోలీస్‌స్టేషన్ పరిసరాల్లోని పిచ్చిమొక్కలను తొలిగించారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ ఆంధ్రా, స్వచ్ఛదివస్ కార్యక్రమం ప్రవేశపెట్టి పరిసరాల పరిశుభ్రతకు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అందులో భాగంగా మన ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో అదే విధంగా మన పోలీస్‌స్టేషన్, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనే ఉద్దేశ్యంతో సిబ్బందితో కలిసి పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్వచ్ఛఆంధ్రా కార్యక్రమం చేపట్టామన్నారు. ఎస్ఐ ఎం.చంద్రరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
కవిటి: మండలం కపాసుకుద్దిలో ఆదివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు రోడ్లు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర యువజన సంఘం పెద్దలు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే మన ఆరోగ్యం ముడిపడి ఉందని, అది ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామలింగేశ్వర యువజన సంఘం పెద్దలు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలాస : పోలీస్‌స్టేషన్ పరిసరాలను శుభ్రం చేస్తున్న పోలీసు సిబ్బంది

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పలాస: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులంతా ఒకచోటుకు చేరి సందడి చేశారు. 2000 - 2001లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్దకు చేరి ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘనంగా సత్కరించారు. కొంచాడ ధనంజయ, తంగుడు గోపాల్, బద్రి సోమేష్, కృష్ణచంద్ర పాత్రో, బైరిశెట్టి శ్రీనివాసరావు, గుడ్ల చైతన్య, సుజల, సౌజన్య, శంకర్, పూర్ణిమ జలజాక్షి, నీలాచలం పట్నాయక్ పాల్గొన్నారు.
వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి శివసాగర్ తీరంలో 1996-97లో అక్కుపల్లి హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ప్రతిఏటా కలుసుకోవాలని ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న స్నేహితులను ఆదుకోవాలని తీర్మానం చేసుకున్నారు.

కవిటిలో సందడి చేసిన 1993-98 బ్యాచ్

కవిటి: స్నేహానుబంధం వెల్లివిరిసింది. దశాబ్దాలుగా కలుసుకోని స్నేహితులంతా ఏకమయ్యారు. ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. ఆడారు.. పాడారు. తమ అనుభవాలు గత స్మృతులు నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు - ఇలనాటి పరిస్థితులు మదించుకున్నారు. ఈ సంతోషాల సందడికి కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల (1993-98 బ్యాచ్), రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (1996-2001 బ్యాచ్) బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు (1983-88 బ్యాచ్) వేదికయ్యాయి.

శ్మశానవాటికలో శ్రమదానం

శ్రమదానం చేస్తున్న యువకులు

వజ్రపుకొత్తూరు: పూండి గోవింద పురం శ్మశాన వాటికలో యువకులు ఆదివారం శ్రమదానం చేపట్టారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ పిలుపుమేరకు కృష్ణార్జున యువసైన్యం సభ్యులు శ్రమదానం చేశారు. శ్మశానవాటిక పరిసర ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా ముళ్ల పొదలతో అధ్వానంగా ఉన్న రోడ్డుకు ఇరువైపుల ఉన్న పొదలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ స్మశానవాటికకు వెళ్లడానికే వీలు లేకుండా ఉండడంతో పాటు అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతుల కుటుంబ సభ్యులు అవస్థలు పడుతున్నారన్నారు. దీంతో జెసిబితో పరిసరాలను శుభ్రం చేశామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గణేష్, విఘ్నేష్, చంద్రయ్య, నాగు, చినబాబు, మొఖలింగం, అప్పారావు, కామేష్, అప్పలస్వామి సారథి, ఈశ్వరరావు, క్రాంతి, మోహన్, వినోద్, తిరుపతి, బాలకృష్ణ, రమేష్, వెంకటరావు, కామేష్, వెంకటరావు, సింహాచలం, తిరుపతి, గోవింద తదితరులు పాల్గొన్నారు.

కొర్లకోట జంక్షన్ వద్ద ఏర్పాటు చేస్తున్న స్టాపర్

స్టాపర్ల ఏర్పాటు

ఆమదాలవలస: రహదారి ప్రమాదాల నివారణకు వేగ నియంత్రికలను పలు కూడళ్లలో ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు. పట్టణ పరిధిలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి కొర్లకోట జంక్షన్, సెయింట్ ఆన్స్ స్కూల్ జంక్షన్‌ల వద్ద వేగ నియంత్రికలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నియంత్రకలను ఏర్పాటు చేయడం వలన అధిక వేగంతో వచ్చే వాహనాలను నియంత్రించవచ్చునని తద్వారా ప్రమాదాలను అరికట్ట వచ్చునని తెలిపారు. వాహనదారులు రహదారి నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్‌లను ధరించి ప్రయాణాలను కొనసాగించాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి అండ

పోలాకి : బంగారాన్ని అందజేస్తున్న మిత్రబృందం

ప్రజాశక్తి- పోలాకి
బాల్యంలో అందరూ కలిసి విద్యను అభ్యసించారు. వాట్సాప్ పుణ్యమా అంటూ అందరూ గ్రూపులో క్షేమ సమాచారంతో పాటు బాల్యం గుర్తులు తలుచుకొని ఆనందపడ్డారు. ఆదివారం 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకొని అందరూ దీర్ఘశి హైస్కూల్‌లో కలుసుకున్నారు. కొంతమంది ఉద్యోగులు, మరికొందరు వ్యాపారస్తులు, మరికొందరు వివిధ ప్రైవేట్ సంస్థల్లో మంచి హోదాల్లో, మరి కొంతమంది వ్యవసాయాలు చేస్తూ ఉన్నతంగా బతుకుతున్నారు. తమ మిత్రుడు అనారోగ్యంతో మరణించడంతో మిత్రుల హృదయం కలచివేసింది. వెంటనే రూ.30 వేలు పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అంతటితో ఆగకుండా మిత్రుడికి ఆడపిల్లని తెలియడంతో మరో రూ.25 వేలు పెట్టి బంగారం కొని మిత్రుడు భార్యకి అందించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందం పంచుకోవడం కోసమే కాదు, మిత్రులు ఆపదలో ఉంటే సహాయం అందించడం ఆనందంగా ఉందని మిత్ర బృందం తెలిపారు.
ఇచ్ఛాపురం: గత మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తన వార్డులో పేద ఆడపడుచు వివాహ సమయంలో ఆర్థికసాయం అందిస్తానని ఇచ్చిన మాట ప్రకారం ఆదివారం ఆర్థిక సహాయం అందించిన వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ యాదవ్ దాతృత్వానికి పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం గీతాసాహు వివాహం సందర్భంగా వాళ్ల ఇంటికి వెళ్లి రూ.15 వేలు అందించారు. కార్యక్రమంలో అర్జున్, నిత్యానంద పట్నాయక్, హేమలత దేవి, కృష్ణ, దేవా, వి కె పి. యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందజేస్తున్న దిలీప్‌కుమార్ యాదవ్

31 వరకు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

కోటబొమ్మాళి: రాష్ట్ర వ్యవసాయ, పాడి పరిశ్రమ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ఈనెల 20 నుంచి 31 వరకు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ ప్రతిరోజు రెండు గ్రామాల్లో ఈ వైద్య శిబిరాలు నిర్వహించటం జరుగుతుందని, వైద్య శిబిరం నిర్వహించిన ముందురోజు ఆయా గ్రామాల్లో దండోర వేయటం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో పశువులు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ, అమ్మవారు, కోళ్లలో కొక్కెర వ్యాధులకు పశు వైద్యాధికారుల పర్యవేక్షణలో నివారణ టీకాలు వేయటం జరుగుతుందన్నారు. గతంలో జబ్బువాపు, గొంతువాపు, ముద్ద చర్మవ్యాధి, గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయని పశువులకు టీకాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.
వజ్రపుకొత్తూరు: పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి మెట్ట పాపారావు అన్నారు. ఆదివారం విలేఖర్లతో మాట్లాడుతూ మండలంలో 20న ఉంద్రూకుడియా, 21న మెట్టూరు, 22న పల్లిసారథి, 23న బెండి, 24న బాతుపురం, 25న గుల్లలపాడు, 27న గరుడుభద్ర, 28న రాజాం, 29న పెద్దబొడ్డపాడు, 30న శీతాపురం, 31న పెద్దబడాంలో శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.
మందస: ఈ నెల 20 నుంచి 31 వరకు నిర్వహించనున్న ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతిలు తెలిపారు. మండలంలో పశుసంవర్ధక శాఖ సిబ్బందితో రెండు బృందాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం శిబిరాలను నిర్వహిస్తామన్నారు.
ఆమదాలవలస: మండలంలో ఈ నెల 20 నుంచి నిర్వహించనున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఎడి ఆర్.ఆనందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో పశువుల వ్యాధులు పశు వైద్యులకు తెలియజేసి చికిత్సలు చేయించు కోవాలని కోరారు.

మాట్లాడుతున్న నరేష్‌కుమార్

విద్యార్థులకు శిక్షణ

పాతపట్నం: ఎపి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ఐటి అండ్ ఐటిఇఎస్ ట్రైనర్ ఎన్ని నరేష్ కుమార్ వృత్తిపరమైన శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని 10 రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మండల కేంద్రంలో ఉన్న ఐటి అండ్ ఐటిఇఎస్ విభాగంలో 10 రోజుల పాటు మీసేవ, టైపు అండ్ జిరాక్స్, కంప్యూటర్ జాబ్‌వర్క్స్, ఇంటర్నెట్ సెంటర్స్, ఫోటో స్టూడియోస్, ఫ్లెక్సీ బ్యానర్ సెంటర్స్, కంప్యూటర్ ఇన్స్టిట్యూట్స్, ప్రింటర్ కేర్ అండ్ హార్డ్వేర్ సెంటర్‌ను పాతపట్నం, పర్లాకిమిడిలో పదిరోజులకుగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శిక్షణ తీసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా అందిస్తామన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఐటి రంగంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

కవిటి: త్యాగరాజ స్వామి 178వ ఆరాధనోత్సవాన్ని మండలం గొండ్యాలపుట్టుగలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ బెందాలం అశోక్ మాట్లాడుతూ త్యాగరాజు ఆరాధనోత్సవాలు మన ప్రాంతంలో నిర్వహించడం మంచి పరిణామమన్నారు. త్యాగరాజస్వామి చిత్రపటానికి పూజలు నిర్వ హించిన అనంతరం స్థానిక కళాకారుల బృందం నిర్వహించిన కర్ణాటక శాస్త్రీయ సంగీత వీనులవిందు చేసింది. త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తూ త్యాగరాజస్వామికి గాత్రనీరాజనం పలికారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

మెళియాపుట్టి : చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి
మండలంలోని గొప్పిలికి చెందిన సీపాన అమ్మాయమ్మకు సిఎం సహాయనిధి నుంచి వచ్చిన చెక్కును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అందజేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో అమ్మాయమ్మకు ఆదివారం ఈ చెక్కును అందజేస్తూ ఎమ్మెల్యే మాట్లాడారు. నిరుపేద కుటుంబానికి చెందిన అమ్మాయమ్మ తన భర్త సీపాన కేశవరావు అనారోగ్యానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని తనకు విన్నవించుకోగా అమ్మాయమ్మ ఆర్థిక పరిస్థితిని సిఎం చంద్రబాబునాయుడుకు తాను వివరించినట్టు చెప్పారు. సిఎం స్పందించి రూ.రెండు లక్షల చెక్కును మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మాలతి ఢిల్లీరావు, బొచ్చు ప్రసాదరావు, సర్పంచ్ రవ్వల గణపతిరావు, ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, చాపర మాధవరావు, తామాడ భాస్కరరావు పాల్గొన్నారు.
రణస్థలం రూరల్: మండలంలోని కొచ్చెర్ల పంచాయతీకి చెందిన జీరు గడ్డయ్యకు సిఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.61245 చెక్కును ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జీరు గురునాద్ రెడ్డి, మహంతి అనంత్, గొర్లె శ్రీహరి, లెంక నారాయణరావు, టి.అప్పలరాజు పాల్గొన్నారు.


రణస్థలం రూరల్ : చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు